క్లుప్తంగా

దేశాలమ్మవారి అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న కవురు శ్రీనివాస్ తదితరులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లాకు సెంటర్ చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు, గుణ్ణం నాగబాబు, మేకా శేషుబాబు పాల్గొని ప్రారంభించారు. సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. చందక సత్తిబాబు, బాకూరి నిరంజన్, లోపింటి చిరంజీవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూలి రూ.600 ఇవ్వాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పాదుషా

పెనుగొండ: పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వేతనం రూ.600 చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం చినమల్లంలో ఉపాధి పనుల ప్రాంతాల్లో కూలీలతో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2025వ సంవత్సరానికి కనీస వేతన చట్టం ఆధారంగా ఉపాధి వేతనాన్ని సమీక్షించాలని కోరారు. కార్మికుల పనికి కొలత ఆధారంగా తక్కువ వేతనం చెల్లిస్తూ శ్రమ దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల ప్రమాద బీమాకు కార్మికులే రూ.20 చెల్లించాలంటూ వసూలు చేయడం దారుణమన్నారు. బీమా రుసుం ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

జూలై 9న సమ్మె

పాలకొల్లు సెంట్రల్: కార్మికుల చట్టాల రక్షణ కోరుతూ జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని సీఐటీయూ నేత జవ్వాది శ్రీనివాస్ కోరారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద ఆయన సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు.

కేసులు రాజీ చేసుకోవాలి

భీమవరం: జాతీయ లోక్అదాలత్‌లో భాగంగా జూన్ 5తేదిన మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని అన్ని కోర్టుల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, సేవాసంస్థ చైర్మన్ బి లక్ష్మీ నారాయణ చెప్పారు. లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ కాదగ్గ క్రిమినల్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, గృహ హింస వంటి కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. సివిల్ కేసు రాజీ పడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కాలాన్ని, వ్యయాన్ని ఆదా చేసుకోవచ్చునని జడ్జి తెలిపారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా అవగాహన కల్పించి ఎక్కువ కేసుల రాజీకి కృషి చేయాలని జడ్జి లక్ష్మీనారాయణ కోరారు.

సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలి

తణుకు అర్బన్: వర్తక సంఘాలు సామాజిక సేవల్లో భాగస్వామ్యులు కావాలని శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన సంఘ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించేందుకు కిరాణా వర్తకులు పాటుపడాలని కోరారు. ప్రస్తుత మార్కెట్‌లో మాల్స్ లాంటి బహుళ జాతి కంపెనీల తాకిడి అధికంగా ఉన్నప్పటికీ నాణ్యత, ధరల్లో వినియోగదారులకు నమ్మకం కలిగేలా విక్రయాలు జరిపితే వ్యాపారరంగంలో ఎటువంటి ఒడిదుడుకులు ఉండవని స్పష్టం చేశారు. సంఘ భవనంపై వచ్చే ఆదాయాన్ని పేద వర్తకులకు, సేవా కార్యక్రమాలకు వినియోగించాలని రవీంద్ర నాథ్ కోరారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనాథ్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాలు సదుపాయాలు, అనేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం ఆర్డీఓ కార్యాలయంలో బాలలు బడికి రండి పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి, మొగల్తూరు, కాళ్ల, ఉండి, ఆకివీడు తహసీల్దార్లు గ్రంధి పవన్‌కుమార్, దుర్గాకిషోర్, సుందర్‌సింగ్, నాగార్జున, వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పిన ప్రభుత్వ పాఠశాలలు

- నాడు కార్పొరేట్ హంగులు
- విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలు
- కూటమి ప్రభుత్వంలో నిర్లక్ష్యం



నరసాపురం : 2019కి ముందు లెనిన్ హైస్కూల్ భవనం



నరసాపురం : నాడు - నేడు పథకంలో అభివృద్ధి చెందిన లెనిన్ హైస్కూల్



పెనుగొండ: అభివృద్ధి చేసిన తూర్పుపాలెం ప్రభుత్వ పాఠశాల



పెనుగొండ: నిలిచిన చెరుకువాడ జెడ్పీ పాఠశాల అభివృద్ధి పనులు

నరసాపురం: వైఎస్సార్ సీపీ హయాంలో సర్కార్ బడులకు కొత్తరూపు వచ్చింది. పేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉండాలనే లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు - నేడు పథకంలో శిథిలమైన పాఠశాలల భవనాలను ఆధునికీకరించే బృహత్తర కార్యక్రమం తీసుకున్నారు. అమ్మఒడి లాంటి పథకాలు అమలు చేసి పేదలకు చదువులు భారం కాకుండా చేశారు. ఇవీన్ని ఏడాది కూటమి పాలనలో పడకేశాయి. జగన్ ప్రభుత్వం నాడు - నేడు పథకంలో నరసాపురం నియోజకవర్గంలో 92 పాఠశాల భవనాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. నరసాపురం మండలంలో 78 పాఠశాలలు, మొగల్తూరు మండలంలో 72 పాఠశాలలను రెండు విడతలుగా మొత్తం రూ.129.20 కోట్ల ఖర్చుచేసి ఆధునికీకరించారు. ఒకప్పుడు శిథిలమై ఉన్న పాఠశాలలకు కొత్త హంగులు తీసుకొచ్చారు. జగనన్న అమ్మఒడి పథకంలో గత ఐదేళ్లలో 27,117 మందికి రూ.110 కోట్లు అందించారు. జగనన్న విద్యా దీవెన ద్వారా 6,825 మందికి రూ.31.76 కోట్లు, జగనన్న వసతి దీవెన ద్వారా 5,182 మందికి రూ.18 కోట్లు అందించారు. నేడు కూటమి సర్కార్ విద్యార్థుల సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయడం లేదు. గత ప్రభుత్వంలో అమలు చేసిన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమం ద్వారా గ్రామీణ విద్యార్థుల్లో ఉండే క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడం లాంటి మహత్తర కార్యక్రమాలు కనుమరుగయ్యాయి.

పేదలకు ఇక చదువు దూరం

పెనుగొండ: ప్రతి పేదవాడికీ నాణ్యమైన విద్యనందించాలన్న లక్ష్యం నాడు - నేడుతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దితే, నేడు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు తిలోదకాలిచ్చి ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేస్తోంది. బైజూస్ విద్య, ఉచిత ట్యాబ్‌లు, అధునాతన ల్యాబ్‌లు వంటి ఎన్నో సదుపాయాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థికీ అందించింది. పాఠ్యపుస్తకాలు, నోట పుస్తకాలు విద్యా సంవత్సరం తొలిరోజునే అందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసింది. విద్యను అభ్యసించడానికి అష్టకష్టాలు పడే విద్యార్థుల తల్లిదండ్రులకు అమ్మ ఒడి పేరుతో ప్రతి కుటుంబంలో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఐదేళ్ల పాటు నిరాటంకంగా అందజేసింది. ఆచంట నియోజకవర్గంలో ఐదేళ్లలో 54 వేల మంది విద్యార్థులు అమ్మ ఒడితో లబ్ధి పొందారు. 45 పాఠశాలలను రూ.23 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశారు. నేడు విద్యపై నిర్లక్ష్యం వహించడంతో ఏడాది దాటినా తల్లికి వందనం రాక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చదువుకొనే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని నమ్మబలికి, రేపుమాపంటూ మోసం చేస్తున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాలకొల్లు నియోజకవర్గంలో

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ హయాంలో పాలకొల్లు నియోజకవర్గంలో నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలో మొత్తం 97 పాఠశాలల్లో 49 పాఠశాలలు నాడు - నేడుకు ఎంపికయ్యాయి. వీటిలో రూ.13.19 కోట్లు నిధులు మంజూరవ్వగా రూ.5.70 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. అమ్మఒడి ద్వారా నియోజకవర్గంలో ఐదేళ్లలో సుమారు 62 వేల మంది విద్యార్థులు లబ్ధిపొందారు.

తల్లికి వందనం ఏమైందో?



కూటమి ప్రభుత్వం పేదలకు విద్యను దూరం చేస్తోంది. గత ప్రభుత్వంలో విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు. నేడు రోజురోజుకు నిర్వీర్యం చేస్తున్నారు. అమ్మ ఒడిని దూరం చేశారు. తల్లికి వందనమన్నారు. నేటికి అతీగతీ లేదు. అడిగితే విమర్శిస్తున్నారు.

– కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, మాజీ డైరక్టర్, విద్యామౌలిక వసతుల కార్పొరేషన్

కృష్ణాజీని సన్మానించిన జయసరిత



కృష్ణాజీని సన్మానిస్తున్న జయసరిత

యలమంచిలి: వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మండలంలోని కొంతేరు గ్రామానికి చెందిన పెచ్చెట్టి కృష్ణాజీని న్యాయవాది, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కర్రా జయసరిత శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనందరిపై నమ్మకంతో జగన్‌మోహన్‌రెడ్డి పదవులు ఇచ్చారని చెప్పారు. ఆయన నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీ అభివృద్ధికి ఇష్టంతో పనిచేద్దామని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుబ్బల రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమా మహేశ్వరరావు, సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, దేవ రాజేష్, వీరా మల్లికార్జున, రామానుజుల చిన మధు, బాబూరావు, హేమలత, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఉండి: ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ వారి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సు(ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్) 45 రోజుల కాలవ్యవధి గల స్వల్పకాలిక కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన ఆసక్తి మహిళలు నేరుగా ఐటీఐని సంప్రదించాలని తెలిపారు. వచ్చే నెల 9వ తేదీలోపుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 96760 99988, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ 94928 85556లో సంప్రదించాలన్నారు. శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని కోరారు.

ఉగ్రవాదాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలి



పెనుగొండ : ఆచంటలో ప్రజా సంఘాల సమైక్యతా యాత్ర



నరసాపురం : ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ : ఉగ్రవాదం మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపు నిచ్చారు. మత సామర స్యదేశ సమగ్రత పరిరక్షణకు సీపీఎం చేపట్టిన సమైక్యత యాత్ర శుక్రవారం ఆచంటలో నిర్వహించారు. రామేశ్వరస్వామి సత్రం నుంచి కచేరీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని తెలిపారు. గతంలో సర్జికల్ స్ట్రైక్స్ పేరుతో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, ఇప్పుడు ఉగ్రవాదులు ఎక్కడ నుంచి వచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేతా గోపాలన్, పి.మోహనరావు, కాకర వెంకటేశ్వర్లు, షేక్ పాదుషా, తలుపూరి బుల్లాబ్బాయి, సిర్ల నరసింహమూర్తి, మచ్చ సుబ్బారావు, ఎస్‌వీఎస్ శర్మచ పిల్లి చంటిబాబు, గుత్తుల రంగారావు, బండి రంగారావులు పాల్గొన్నారు.

సీపీఎం సమైఖ్య యాత్ర

నరసాపురం: దేశ సమైక్యత, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామంటూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సమైఖ్య యాత్ర స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి శివాలయం సెంటర్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టుకుని శిక్షించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనిక అధికారి సోఫియాఖురేషీని ఉగ్రవాద సోదరంటూ బీజేపీ మతోన్మాదులు పిలవడం దారుణమని తెలిపారు. సైనికుల త్యాగాలను రాజకీయాలకు వాడుకోవడం మంచిదికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జల్లి రామ్మోహన్‌రావు, పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ, తాడి నాగభూషణం పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన రోజు, ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు జూన్ 4ను వెన్నుపోటు దినోత్సవంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ వెన్నుపోటు దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం భీమవరంలో జిల్లా కలెక్టర్‌కు హామీల డిమాండ్ పత్రాన్ని ఇవ్వనున్నట్టు చెప్పారు. చంద్రబాబు చేసిన మోసానికి నిరసనగా నిర్వహించే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి కృష్ణాజీ, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, రామానుజుల చిన్నమదులు పాల్గొన్నారు.

చర్చి స్థలాన్ని అడంగల్‌లో నమోదు చేయించండి



ఆర్డీఓ రాజుకు వినతిపత్రం అందిస్తున్న రుస్తుంబాద గ్రామస్తులు

నరసాపురం రూరల్: రుస్తుంబాద ఎస్‌డీఏ చర్చి స్థలాన్ని అండగల్‌లో నమోదు చేయించాలని రుస్తుంబాద గాదివారితోటకు చెందిన ఎస్‌డీఏ చర్చి కమిటీ సభ్యులు ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల చర్చి స్థలంలో నిర్మాణం చేపట్టడంతో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు అడ్డుకుని స్థలం చర్చి పేరున లేదని తెలపడంతో చర్చి సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో శుక్రవారం వారంతా ఆర్డీఓను కలిశారు. 1931లో గ్రామానికి చెందిన గాది తాతయ్య, గాది వెంకటనర్సయ్య, గాది రెడ్డియ్య అనే వారి నుంచి ఇండియన్ ఫైనాన్సియల్ అసోసియేషన్ ఎస్‌డీఏ చర్చి సంఘం తరపున సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ కాపీలను ఆర్డీఓకు అందించారు. అయితే సదరు స్థలం అడంగల్ నందు పంచాయతీకి చెందినదిగా నమోదయినట్టు అధికారులు తెలిపారని వివరించారు. 94 ఏళ్లుగా చర్చి కార్యకలాపాలు నిర్వహించుకుంటున్న తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రుస్తుంబాద, గాదివారి తోటకు చెందిన ఎస్‌డీఏ చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముంపు తట్టుకునే రకాల సాగు మేలు



వ్యాపారులతో మాట్లాడుతున్న ఏడీఏ అనిల్ కుమారి

నరసాపురం రూరల్: రాబోవు ఖరీఫ్ సీజన్‌లో వరిసాగులో ముంపును తట్టుకునే రకాలసాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అన్నారు. శుక్రవారం నరసాపురం వ్యవసాయశాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో విత్తన వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఎంటీయూ 1232, ఎంటీయూ 1140, పీఎల్ఏ 1100 తదితర ముంపును తట్టుకునే రకాలను సాగు చేసేలా చూడాలన్నారు. 140 రోజుల కాలపరిమితి గల ఈ రకాలు మన ప్రాంతానికి అనుకూలమైనవని తెలిపారు. అయితే వీటితో పాటు ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 1318, ఎంటీయూ 1172, రకాలను కూడా సాగు చేయవచ్చని, కానీ ఈ విత్తన రకాల కాలపరిమితి ఎక్కువగా ఉంటుందని వివరించారు. చౌడును తట్టుకునే ఎంసీఎం–103 రకం 140 రోజుల పంట కాలం కలిగినదన్నారు. సూపర్ ఫైన్ రకం కూడా మన ప్రాంతానికి అనుకూలమైందని ఖరీఫ్ సాగులో రైతులకు అందుబాటులో ఉంచాలని డీలర్లకు ఏడీఏ సూచించారు. వేరే కొత్త రకాలు, ఇంకా విడుదల కానీ రకాలు వేయవద్దని, విత్తనాలు కొనుగోలు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని రైతులకు సూచించారు.

యోగా జీవితంలో భాగం కావాలి



యలమంచిలిలో యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపీడీఓ ప్రేమాన్విత

యలమంచిలి: యోగాను జీవితంలో భాగస్వామ్యం చేసుకునేలా గ్రామ స్థాయిలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత సూచించారు. యోగాంధ్ర వెబ్‌సైట్‌లో నమోదైన వారి యోగ శిక్షణ శిబిరం శుక్రవారం స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో నిర్వహించారు. 244 మందికి శిక్షణ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి పొదుపు భవిష్యత్తుకు బంగారు బాట



మాట్లాడుతున్న ప్రాజెక్టు ఏసీడీపీఓ నాగరత్నం

యలమంచిలి: నేడు మనం చేసిన పొదుపు భవిష్యత్తులో ఏ కష్టమొచ్చిన ఆదుకుంటుందని ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు ఏసీడీపీఓ నాగరత్నం అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా సెషన్–9 ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అనే అంశంపై శుక్రవారం శిరగాలపల్లి గ్రామ సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అనవసర ఖర్చులు చేయకుండా డబ్బును ఆదా చేస్తూ పొదుపు చేయాలని సూచించారు. ఆర్థిక ప్రణాళిక, భవిష్యత్తు లక్ష్యాలు గురించి కిశోర బాలికలతో చర్చించారు. కార్యక్రమంలో మిషన్ వాత్సల్య సిబ్బంది పి.మమతాశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, జీఎం గీత, ఏఎన్ఎం బి.సావిత్రి, ఆశా వర్కర్లు రాణి, శాంతి, శారద ఎంఎల్‌హెచ్‌పీ బి.శిరీష, డ్వాక్రా సీఏ వెంకటరమణ, డ్వాక్రా వీఓ మాధవి, అంగన్‌వాడీ టీచర్లు కె.తులసి, ఎన్ జాన్సీ రాణి, కె.పెద్దింట్లు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. మండలంలోని చించినాడ అమర వీరుల స్మారక భవనంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో అమర వీరుల త్యాగాల ఫలితంగా నిర్మితమైన విశాఖ ఉక్కు కర్మాగారం దేశంలోనే ఒక ప్రముఖమైన పెద్ద పరిశ్రమగా స్థిరపడిందన్నారు. 40 ఏళ్లుగా అనేక వేల మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తోన్న కుట్రలను కూటమి ప్రభుత్వం అడ్డుకోపోవడం దారుణమని అన్నారు. గత నాలుగేళ్లుగా అక్కడి కార్మికులు చేస్తోన్న పోరాటం ఫలితంగానే ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. అయితే పరిశ్రమలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను తొలగించే ప్రయత్నాలను నిరసిస్తూ కార్మికులు ఈ నెల 20 నుంచి సమ్మె చేస్తున్నా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాతిరెడ్డి జార్జి, కానేటి బాలరాజు, కేతా సూర్యారావు, అంబటి రంగనాయకులు, దిద్దే ఏసోబు, గూడూరు ఆంజనేయులు, జిల్లెళ్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, యడ్ల మోహనరావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జునరావు

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ఉండి, వ్యవసాయ పరిశోధనా స్థానం మార్టేరు వారి సంయుక్త సారథ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఆశించే పురుగులు, తెగుళ్ల, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రబి పంట కోసిన వెంటనే గడ్డిని తగలబెట్టడం వల్ల పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని, భూమిలో కార్బన్ శాతం పెరిగి మొక్కలకు పోషకాలు అందవని వివరించారు. గడ్డిని కాల్చకుండా డీకంపోజర్లు ఉపయోగించి కుళ్లింపజేసి దానిని భూమిలో కలియదున్నాలని సూచించారు. డాక్టర్ పి.వినయ లక్ష్మి మాట్లాడుతూ ముంపును తట్టుకునే , డెల్టా ప్రాంతంలో సాగుకు అనుకూలమైన వరి రకాలను వివరించారు. గోస్తనీనది ముంపు ముంపును తట్టుకునే వరి కొత్త రకాలను రైతులకు అందించాలని పరిశోధనా స్థానం వారికి సూచించారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ పరిశోధన స్థానం పెదవేగి నుంచి డాక్టర్ ఒ.మనోరమ, ఉండి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బిందు ప్రవీణ, మార్టేరు పరిశోధన స్థానం నుంచి డాక్టర్ బి.సహదేవరావు ఆనంద్ కుమార్, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ దొంగ మహాలక్ష్మి, స్థానిక రైతులు సుందర్ రామిరెడ్డి, కాసాని విజయప్రసాద్, సోమేశ్వరరావు, బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ అధికారిని కె.జోషిలా తదితరులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి సేవలో ఆడిట్ ఆఫీసర్

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని కోనసీమ జిల్లా డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ ఏవీవీ సత్యనారాయణ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. గణపతి పూజ అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారిని ఆలయ సూపరింటెండెంట్ పి.వాసు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.